# దైవపీఠం

-కప్పగంతుల మల్లికార్జునరావు

మహానాయకుడు 'అమ్మ'కు పాదాభివందనం చేసేడు. అనుచరవర్గం అమాంతం ఆమె ముందు బొక్క-బోర్లాపడ్డారు.

అమ్మ మొహానికి ప్రసన్నతను పులుముకొని అభయ ముద్రను అభినయించింది.

అప్పుడు తనామె కళ్లల్లో పడ్డాడు.

అతనికి అరవై ఏళ్లు వుంటాయి. బ్లాక్ అండ్ వైట్ జుట్టు, గడ్డం...అందమైన పర్సనాలిటీ, ఆకర్షణీయమైన మొహం...

అనుచర వర్గంలో అతనూ వొకడు. అయినా అతను అందరిలా భక్తిని అభినయించటం లేదు.

నిటారుగా నిలబడి 'అమ్మ' కళ్లల్లోకి సూటిగా చూస్తున్నాడు.

అమ్మకళ్లు అతని కళ్లతో కలిసేయి. అమ్మ ఛప్పున కళ్లు మూసుకొంది.

''అమ్మా. ఎలక్షన్లొస్తున్నాయి. అయిదేళ్ళ క్రితం మీ ఆశీస్సులే, నన్ను నా పార్టీని గెలిపించాయి. ఈసారి కూడా మీ ఆశీస్సులు అనుగ్రహం కావాలి. దీవించమ్మా''

అమ్మ ప్రసన్నంగా నవ్వుతూ కళ్లు తెర్చింది. చెయ్యి గాలిలోకి గుండ్రంగా తిప్పింది.

''ధైర్యంగా ముందుకు వెళ్లరా. ఈ ఉంగరం ధరించు. నీకే ఎదురు ఉండదు''

అమ్మ మహిమను కళ్లారా చూచిన అనుచరగణం ఉబ్బితబ్బిబ్బయిపోయి ఆమెకు జేజేలు కొట్టేరు.

అమ్మకు యాభై ఏళ్ల వయసు. అయినా ముప్పై ఏళ్ల యువతిలా వుంటుంది.

నాయకుడికి డెబ్బై ఏళ్లు. రాజకీయాల్లో తలపండినవాడు. పాలకుడు. నాయకుడు. అయినా అమ్మ దృష్టిలో అతను పసిపిల్లవాడే. ఏకవచనంతో సంబోధిస్తుంది. స్కూలు టీచరులా మందలిస్తుంది.

''కానీ ఒరేయ్. నీకు బుద్ధి లేదురా''

''క్షమించమ్మా. ఏం తప్పు చేసేను?''

''వాడెవడురా- ఆ గడ్డం మనిషి. అలాంటి వాళ్లను ఆశ్రమంలోకి ఎందుకు తీసుకొస్తావ్? అవతలికి పంపు''

నాయకుడు కంగారుపడ్డాడు.

''ఆగ్రహించకమ్మా. అంతర్జాతీయ ప్రసిద్ధిగల చిత్రకారుడు రవీంద్ర అతను. శిల్పికూడా. నాకు బాగా కావల్సినవాడు. అతనిప్పుడో మహాద్భుత చిత్రం రచించాలని తాపత్రయ పడ్తున్నాడు. అందుకు 'అమ్మ ఆశ్రయం అనువైన ప్రదేశం' అని చెప్పి నేనే తీసుకొచ్చాను''.

''ఊ..అయితే?'' ఆ నాలుగక్షరాలను అమ్మ అన్న తీరు నాయకుడికి దడ పుట్టించింది.

''రవీంద్రా. అమ్మకు పాదాభివందనం చెయ్యి ప్రసన్నురాలవుతుంది'' మహానాయకుడు రవీంద్రతో అన్నాడు.

''నేను కళాకారుడిని. తలవంచే తత్వం నాకు లేదని మీకు తెలియదా?''

''అయినా సరే, నా కోసం..ప్లీజ్''

రవీంద్ర అమ్మ కళ్లల్లోకి సూటిగా చూచాడు. అమ్మకు దగ్గరిగా వెళ్లాడు. తలవంచి నమస్కరించాడు.

''ఎంత చూచినా నాకు మీలో 'జగన్మాత' కన్పించటం లేదు. ఒక ప్రేమమూర్తి మాత్రమే కన్పిస్తున్నది. ఆ ప్రేమ దేవతకు శిరసు వంచి నమస్కరిస్తున్నాను.''

అమ్మకు మాత్రమే వినబడేలా అన్నాడు.

దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆశ్రమం కిటకిటలాడుతోంది. అంతటా విషాదం. అమ్మ అందర్నీ ఆ గదిలో నుంచి పంపించేసి, దగ్గరికి రమ్మని అతడిని కళ్లతోనే ఆహ్వానించింది. మంచం మీద ఎముకల్ని మానవాకారంగా పేర్చినట్లుందామె.

ఆమె కళ్లు ఆనందంతో వెలిగేయి.

అది గ్రహించి 'అమ్మయ్య' అనుకొని ఊపిరిపీల్చుకొన్నాడు మహానాయకుడు.

★★★

అమ్మ తనని ప్రేమిస్తోంది. తను కూడా అమ్మను ప్రేమిస్తున్నాడు.

రవీంద్రకు నవ్వొచ్చింది.

ప్రేమ! అరవై ఏళ్లకు ప్రేమ! ప్రేయసి ఎవరు? అమ్మ! ఓహ్!

అతనికి తన అరవైఏళ్ల జీవితం లీలామాత్రంగా గుర్తుకొచ్చింది.

చిన్నప్పటి నుంచి అతనికి శిలల్లో శిల్పాలు కన్పించేవి. మనుషుల్లో అద్భుత చిత్రాలు కన్పించేవి.

''మానవుల అంతర్గత ప్రపంచాన్ని నీ చిత్రాలలో సహజంగా చిత్రించావు రవీంద్రా. మానవ సంబంధాలకు నూతన అర్థాలు చెప్పేవు. కానీ నీ చిత్రాలలో ఏదో పెద్దలోపం వుంది. అదేమిటో యిటీవలే తెల్సుకోగలిగేను'' ప్రపంచ ప్రసిద్ధి చెందిన వొక ఆర్ట్ క్రిటిక్ అన్నాడు రవీంద్రతో.

''లోపమా? ఏమిటి?''

''నీ కళాఖండాలకు హృదయం లేదు. కనుక చలనం లేదు. అందుకే నీ చిత్రాలు 'ఆహా' అని పరవశింపచేస్తాయి కాని గుండెని కదిలించవు''

కొత్తకోణం-కొత్త ఆలోచనలు!

''మనిషి జీవితానికి, హృదయం లాంటిది ప్రేమ. నీకు తలిదండ్రులు లేరు. భార్యా పిల్లల్లేరు. ఆ అనుభూతుల మాధుర్యం నీకు తెలియదు. యిప్పటికైనా మించిపోయిందేముంది? ప్రేమించి చూడు. అప్పుడు నువ్వు గీసే చిత్రాలు నీకే ఆనందానుభూతిని కల్గిస్తాయి''

అతనప్పుడు స్త్రీలను పదార్థాల లాగాకాక ప్రేమ దృష్టితో చూడనారంభించాడు.

కొందరతని ఖ్యాతిని ప్రేమించారు. మరికొందరతని డబ్బును ప్రేమించారు.

కానీ అతడిని ప్రేమించిన స్పందన ఎవరిలోనూ అతనికి కనిపించలేదు.

అయినా చాలామంది అతడిని అరవయ్యో ఏట కూడా పెళ్లి చేసుకోటానికి సిద్ధపడ్డారు.

అతడికి కావాల్సింది పెళ్లి కాదు. ప్రేమ.

అమ్మని చూడగానే అతని హృదయం అనుకోకుండానే ప్రేమతో స్పందించింది.

ఆమె గుండె అతనితో ఎన్నో ప్రేమ కబుర్లను చెప్పింది.

అమ్మ తనని ప్రేమిస్తోందని, తనని చూడగానే పరవశించిందని అతనికి తెల్సు.

అయినా అయిష్టతను నటించింది. 'అమ్మ' లాగా తన దైవశక్తిని ప్రదర్శించే వ్యర్థ ప్రయత్నం చేసింది.

అతను అమ్మ గత జీవితాన్ని కూపీ తీసి తెల్సుకొన్నాడు.


★★★

'అమ్మ' అవతారం ఎత్తకముందు ఆమె పేరు సుశీల.

ధనవంతుల యింట్లో పుట్టింది. అందగత్తెగా, తెలివితేటలు గలదిగా గుర్తింపు పొందింది. పుస్తకాల పురుగు అన్న బిరుదు సంపాదించుకొంది. ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచిస్తుంది. తర్కబద్ధంగా మాట్లాడుతుంది.

తల్లిదండ్రులు ఆమెకు చాలా గొప్ప సంబంధం తీసుకొచ్చారు.

ప్రకాశరావుకు తండ్రిలేడు. బోలెడంత ఆస్తివుంది. అయ్యేయస్ ఉద్యోగం వుంది. అందంగా వుంటాడు.



''అతడు నాకు నచ్చలేదు.''

''ఏం? బాగానే వున్నాడుగా?''

''నా కళ్లతో చూడు''

''అయితే యింకో సంబంధం చూస్తాంలే''

''వద్దు. నేనసలు పెళ్లే చేసుకోను''

''ఏం? ఎందుకు?''

''నీకు కాకరకాయ కూరంటే ఎందుకు యిష్టం లేదంటే కారణం చెప్పగలవా?''

అయినా చివరికి ఆమె పెద్దల పట్టుదలకు తలవొగ్గక తప్పలేదు.

ఆమె ప్రకాశరావుకు భార్య అయింది.

మొదటిరాత్రి కాగానే అతను ఉద్యోగం అంటూ అస్సాంకు ప్రయాణమయిపోయాడు.

''అదేమిటి అల్లుడుగారు. అంత హఠాత్తుగా ప్రయాణం ఏమిటి? పోనీ అమ్మాయిని కూడా తీసుకెళ్లు''

''యిప్పుడుకాదు. మళ్లీ వచ్చి...''

అతను మళ్లీ రాలేదు. ఉత్తరాలకు జవాబు లేదు.

మొదటిరాత్రి సుశీల భర్తతో ఏదో గొడవ పెట్టుకొని వుంటుందని అంతా ఊహించారు. వాళ్ల సంసారాన్ని సరిదిద్దాలంటే కనీసం సుశీలన్నా సహకరించాలి కదా?

''సుశీలా. నీకు భర్తవద్ద కెళ్లాలని లేదా?''

''తీసుకెళ్తే వద్దన్నానా?''

''అతను తీసుకెళ్లాలన్న పట్టుదల ఎందుకు? మేం తీసుకెళ్లి దించుతాంగా?''

''అతనేవచ్చి ఎందుకు తీసుకెళ్లకూడదు?''

''పంతాలు పట్టుదలలు వద్దు. అతను మగవాడు. నువ్వు స్త్రీవి. భర్తకు దూరంగా వున్న స్త్రీకి విలువుండదు''

''భార్య దగ్గరగా లేని పురుషుడికి వుంటుందా?''

''నువ్వతడిని ప్రేమించటం లేదా?''

''అతను నా భర్త. యిప్పుడా ప్రశ్న ఎందుకు?''

అతడికేదో దీర్ఘరోగం వస్తే తీసుకొచ్చారు. సేవ చేసి అతనికి పునర్జన్మ నిచ్చింది.

''యింత ప్రేమ వున్నదానివి, అతడిని వదిలి యింతకాలం ఎలా వుండగలిగేవు?''

''అతడెలా వున్నాడు? తెల్సుకొన్నారా?''

''యిప్పుడు నీ అవసరం అతనికెంతైనా వుంది. తీసుకెళ్తానంటే వెళ్తావా?''

''తీసుకెళ్తానన్నాక కదా ఆ ప్రశ్న వచ్చేది?''

పెద్దలంతా కూడగట్టుకొని అతని దగ్గరకెళ్లారు.

''యిప్పుడు కాదు..మళ్లీ వచ్చి..''

వాదనకు, చర్చలకు అవకాశం యివ్వలేదతను. తల్లిని తీసుకొని మళ్లీ అస్సాం వెళ్లిపోయాడు. అంతే-

కొన్నేళ్ల తర్వాత అస్సాం నుంచి వార్త వచ్చింది.

తల్లితో కల్సి జీపులో వెళ్తుంటే ఎవరో టెర్రరిస్టులు అతని జీపును పేల్చివేసేరు. వాళ్ల ఎముకలు కూడా మిగల్లేదు.


ఆ వార్త తెలిసినప్పుడు సుశీల వెక్కి వెక్కి ఏడ్చింది. కొన్నాళ్ళు నిద్రాహారాలు లేవు. అలంకరణలన్నీ తీసేసి విధవ వేషంలోకి మారింది.

''భర్త అన్న పేరేకాని నువ్వు అతనితో కాపురం చేసిందెప్పుడు? మళ్లీ పెళ్లి చేసుకోరాదూ?''

''పెళ్లి లేకపోతే బ్రతకలేనా?''

''బ్రతుక్కి వొక పరమార్థం వుండాలి కదా? తల్లికావాలని ఏ స్త్రీ కాంక్షించదు?''

''సెంటిమెంటు తల్లి కావటం గొప్పా? సృష్టిలోని సమస్త ఆడజీవులూ బిడ్డలకు జన్మనిస్తాయి. మనుష్య జన్మకు, స్త్రీ జన్మకు అంతకుమించిన ప్రయోజనం లేదా? పరమార్థం లేదా?''




''మెడకేస్తే కాలికి, కాలికేస్తే మెడకు- నీతో వచ్చిన చిక్కే యిది. యింతకీ ఏం చేస్తానంటావిప్పుడు?''

''ముందుగా మీకు చెప్పాలా?''

భర్త పేరిట ఆమె శిశు సంరక్షణాలయాలను స్థాపించింది. అత్తగారిపేరిట స్త్రీల పునరావాస కేంద్రాలను నెలకొల్పింది. అవి పైకొచ్చాయి. ఆమె సేవకు దేశంలో గుర్తింపు లభించింది.

అప్పుడే ఆమెను మహానాయకుడు మొదటిసారి కల్సుకొన్నాడు. అప్పటికింకా అతను స్థానిక నాయకుడే.

''నీకు భర్త పోయాడు. పిల్లలు లేరు. నాకు పిల్లలున్నారు. కానీ భార్య పోయింది. మనిద్దరం కల్సి వుంటే ఎలా వుంటుంది? పబ్లిక్‌గా కాదు. రహస్యంగానే'' పచ్చిగా అడిగేడు తను.

ఆమె మనసు, శరీరం కోపంతో, అవమానంతో దహించుకుపోసాగాయి.

''మరీ యింత నేరుగా అడిగానని కోపం తెచ్చుకోకు. అది మన స్టయిలే. నువ్వు తెలివిగలదానివన్నారు. నా ప్రపోజల్‌ను ఆలోచించు. నీ తెలివి తేటలు, చదువు, నా రాజకీయ శక్తి, అధికార బలం కలిస్తే యిద్దరం పైకి వస్తాం. మనిద్దరి అవసరాలు తీరుతాయి. యీ దేశాన్ని ఏలవచ్చు. ఏం?''

పరమాణువులా ఆమె విస్ఫోటనం చెందిందప్పుడు.

''దేశాన్ని ఏలటం నీకు గొప్పకావచ్చు. కానీ విశ్వామిత్రుడు రాజ్యాన్ని వదిలి మహర్షి అయ్యాడు. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. మహావీరుడు 'జిను'డయ్యాడు. అధికార సాధనకు నన్ను కామించిన పాపం వూరికేపోదు''

''శపిస్తున్నావా?''

''కాదు. అమ్మ తల్లిగా నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నువ్వు ఎన్నికల్లో వోడిపోతావు. రాజకీయంగా నామరూపాలు లేకుండా నాశనం అయిపోతావు. నా వాక్కు సత్యవాక్కు పరీక్షించుకో.''

''నీ శాపానికి భయపడ్డాననుకొంటున్నావా?''

''మూర్ఖులు దేనికీ భయపడరని నాకు తెల్సు.''

''అయితే విను. నీ శాపం నిజమైతే నేను నీ పాదాలను ఆశ్రయిస్తాను. నేను గెలిస్తే మాత్రం నువ్వు అన్నివిధాల నాకు లొంగిపోవాలి''

''అలాగే. పరీక్షించుకో. పో''

ఎలక్షన్లలో ఆమె అన్నట్లే జరిగింది. ఘనాదుల్తో సహా అతను లేచిపోయాడు. అన్నీపోయి ఒంటరిగా మిగిలేడు.

''అమ్మా. నువ్వు కాళివి. దుర్గామాతవు. భవానివి. జగజ్జననివి, నన్ను కరుణించు. యీ భక్తుడు తిరిగి శక్తివంతుడయ్యేలా ఆశీర్వదించమ్మా''

అప్పటినుంచి ఆమె 'అమ్మ' అయింది. అతనామె మొదటి భక్తుడయ్యాడు. క్రమంగా ఆమె ఖ్యాతి దేశమంతటా వ్యాపించింది. ఫారినర్స్‌తోసహా ఎందరో ప్రముఖులు ఆమె శిష్యగణంలో చేరేరు.

ఆమె ఆశీస్సులు లభించిన ప్రతిసారి నాయకుడికి రాజకీయాల్లో విజయం లభించింది. అతను ఎదిగి ఎదిగి మహానాయకుడయ్యాడు.

★★★

'సుశీలా'

ఆ పిలుపునకు అమ్మ శరీరం ఝుల్లుమంది. నరాలు వీణాతంత్రులయ్యాయి. హృదయంలో ఎన్నెన్నో రాగాలు పండేయి.

''నువ్వు నీ భర్తను ప్రేమించలేదు. కనుక అతను దూరంగా వెళ్లేలా చేసేవ్. అయినా అతని పట్ల ప్రేమ వున్నట్లు నటించావు.

నన్ను యిప్పుడు ప్రేమిస్తున్నావ్. అయినా ప్రేమించినట్లు నటిస్తున్నావ్. అవునా? కాదా? నిజం చెప్పు'' ఏకాంతంలో అమ్మను నిలేసేడు రవీంద్ర.

''నేను నా బిడ్డలందరిని ప్రేమిస్తాను''

''నేను కళాకారుడిని సుశీలా. నా శక్తిని తక్కువగా అంచనా వెయ్యకు. శిల్పాలను, చిత్రాలను తప్ప ఎవరినీ ప్రేమించని నేను, నిన్ను యీ వయసులో ప్రేమించాను. ఆత్మవంచన చేసుకోకు. ప్రేమ విషయంలో హిపోక్రసీ పనికిరాదు''

''ప్రేమించానంటున్నావు. సంతోషం. కానీ యీ వయసులో ప్రేమించి ఏం చేస్తావు కళాకారుడా?''

''ఆరాధిస్తాను. నిన్ను పెళ్లి చేసుకొని కల్సి జీవిస్తాను. నా ప్రేమను పండించుకొంటాను. నా కళను రంజింప చేసుకొంటాను''

ఆమె వొక్క క్షణం కళ్లు మూసుకొని మౌనంగా వుండిపోయింది.

''కలలు కనకు కళాకారుడా. వాస్తవాన్ని గుర్తించు. నేలమీద నడవని ప్రేమ కథలన్నీ కన్నీటి సరస్సులో మునిగిపోతాయి. నీది కళా తపస్సు అయితే నాది పారమార్థిక తపస్సు. నిన్ను నువ్వు కళలో చూచుకొంటున్నావ్. నన్ను నేను భగవంతుడిలో చూచుకొంటున్నాను. యిక మన కలయిక ఎలా సంభవం? యింత చిన్న విషయాన్ని గ్రహించలేనంత అజ్ఞానం నిన్నెలా ఆవహించింది?''


''ఛీ! నటన! అంతా నటన! ఆత్మవంచన! ప్రేమ పండించుకోలేని నువ్వు భగవంతుడినెలా అర్థం చేసుకోగలవు? నీ జీవితం వ్యర్థం''


## శిల్పా పొడుగు



బొంబాయి నుండి దిగుమతి అవుతున్న మహారాష్ట్ర భామలు ఎక్స్‌పోజింగ్ విషయంలో ఎలాంటి అభ్యంతరం పెట్టరని మన నిర్మాతల అభిప్రాయం. అందుకే తెలుగులో సిమ్రాన్, లైలా ఒక ఊపు ఊపుతున్నారు. ప్రేక్షకులు ఆహో... ఓహో అంటున్నారు. మరి ప్రేక్షకుల్ని ఆకర్షించే జిగిబిగి అందాల సుందరి శిల్పాశెట్టి ఆమధ్య తెలుగులో సాహసవీరుడు-సాగరకన్య, వీడెవడండీ బాబూ చిత్రాల్లో నిటించినా తెలుగులో రాణించలేకపోయింది. ఇంత అందం, నటన గల ఈ సౌందర్యరాశి ఎందుకు వెనుకబడిపోయింది అని అడగ్గా 'శిల్ప బాగా పొడుగు. హీరోయిన్లలో అంత పొడుగు ప్రేక్షకులకి నచ్చదు. అందుకే ఏ నిర్మాతలూ శిల్పతో చిత్రాన్ని తీయడానికి సాహసించలేకపోతున్నారు' అంటున్నారు సినీ జనాలు.

-- శంకర్‌బాబు






అతనా తర్వాత కళాకారుల ప్రపంచానికి కూడా అందనంత దూరంగా వెళ్లిపోయాడు.

★★★

''అమ్మకు సీరియస్‌గా వుంది. మిమ్మల్ని చూడాలనుకొంటున్నది. వెంటనే రండి.''

అమ్మ నుంచి మెసేజ్ పట్టించుకోలేదు రవీంద్ర.

కొన్నాళ్ల తర్వాత మహానాయకుడి నుంచి అభ్యర్థన.

ఆశ్రమానికి వెళ్లేడు.

దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆశ్రమం కిటకిటలాడుతోంది. అంతటా విషాదం.

అమ్మ అందర్నీ ఆ గదిలో నుంచి పంపించేసి, దగ్గరికి రమ్మని అతడిని కళ్లతోనే ఆహ్వానించింది.

మంచం మీద ఎముకల్ని మానవాకారంగా పేర్చినట్లుందామె.

''కళాకారుడా. ఎప్పుడూ నువ్వే నన్ను ప్రశ్నలడిగేవాడివి. యివాళ నిన్నో ప్రశ్ననడుగుతాను. నీ సమాధానం వినటానికే నేనింకా జీవించి వున్నాను.''

''అడుగు''

''యిప్పటికీ నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?''

''ప్రేమిస్తున్నాను. ఎందుకంటే యిప్పుడు నువ్వు నన్ను మరింతగా ప్రేమిస్తున్నావు కనుక! శుష్కించిన నీ శరీరంలో ప్రేమ జ్యోతి మరింత ఉజ్వలంగా ప్రకాశిస్తున్నది కనుక''

''రవీంద్రా'' ఆమె అతడి చేతిని గుండెలమీదకి లాక్కొంది.

ఆమె కళ్లనుంచి ఒక అశ్రువు.

ఆమె గుండెల్లో నుంచి ఒక నిట్టూర్పు.

అతని చేతిని గుండెల మీద వుంచుకొనే అమ్మ ఆఖరి శ్వాసను విడిచింది.

★★★

అమ్మ మరణించిన నాలుగు రోజుల తర్వాత అతని పేర ఆమె రాసిన కవరు అందింది.

''రవీంద్రా,

నీకు తెలియదు. మనిద్దరిదీ ఒకేవూరు. చిన్నప్పుడే నిన్ను ప్రేమించాను. కానీ నువ్వు నావైపు కన్నెత్తి చూడావుకాదు. అప్పుడే ధైర్యం చేస్తే ఎలా వుండేదో?

పెళ్లయ్యాక కూడా నీమీద ప్రేమ చెదరలేదు. తొలిరాత్రి, మానసికంగా నీతో వ్యభిచరించాను. నా మనసు తెల్సుకొన్న నా భర్త నాకు దూరంగా పారిపోయాడు.

ఎంత ప్రయత్నించినా, నా భర్తని గౌరవించాను కానీ, నీ స్థానంలో నిలుపుకోలేకపోయాను.

అరవయ్యోపడిలో అమ్మగా నన్ను చూచి, ఒక స్త్రీగా నన్ను ప్రేమించావు నువ్వు. నేనెంత అదృష్టవంతురాలిలో.

అయితే అప్పటికే నేనో మాయా ప్రపంచంలో యిరుక్కొని వున్నాను. అందువల్ల నీ ప్రేమకు మనసు స్పందించినా, హృదయాన్ని చంపుకొని ఏకాంతంలో వెక్కి వెక్కి ఏడ్చాను.

దైవపీఠం మీద నిలబడ్డ శిలకు ఏ బాధ వుండదు. కానీ ఆ పీఠం మీద నిలబడ్డ మనిషికి ఎన్నెన్ని బాధలో? వింత వింత తత్వాలు గల భక్తుల మానసిక రోగాల్ని కనిపెట్టి చికిత్స చేయాలి. వారి విశ్వాసం చెదిరిపోకుండా చూచుకోవాలి. అమ్మలు, బాబాలను మించిన సైకియాట్రిస్టులు ఎక్కడున్నారు రవీంద్రా?

మొదట్లో నాకిదంతా థ్రిల్లింగ్‌గా వుండేది. కానీ క్రమంగా అదంతా అర్థంలేని విన్యాసంగా, మానసిక రుగ్మతగా కన్పించింది. కానీ మనుష్యుల చేతిలో చిక్కిన దేవతను నేను. బయటపడే మార్గమేదీ?

నిజం చెప్తున్నాను రవీంద్రా. విసుగేసి, జనం మీద కోపంతో, నిజంగా అనేక శక్తులున్న దేవతలా ఎంత అహంకారాన్ని ప్రదర్శించానో? భక్తులంటే పైకి ప్రేమ నటిస్తూ, వారిని మనసులో ఎంత అసహ్యించుకొన్నానో?

నీ ప్రేమ మళ్లీ నన్ను మనిషిని చేసింది.

జీవితంలో చాలాభాగం దేవతగా చస్తూబతికేను. యివాళ ఆ దేవత చనిపోతున్నది. 'అమ్మ' అంతర్ధానమైపోతుంది. అందరి స్మృతులలో నుంచి.

కళాకారుడివి నువ్వు. ప్రేమమూర్తివి.

నీ కుంచెలోనో, ఉలి లోనో నీ ప్రేమనంతా నింపి, నాకు మనిషిగా ప్రాణం పొయ్యి.

నీ బొమ్మగానో, చిత్రంగానో, కలకాలం నీతో కల్సి జీవించే అదృష్టం కలుగజెయ్యి. యిది నా కోరిక. తీరుస్తావు కదూ?

ఓ ప్రియుడా...ఓ నా కళాకారుడా...


నీ

సుశీల

రవీంద్ర ఆ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించివేసేడు.

కుంచెను రంగులో ముంచాడు.

★



## 'ఇష' అదృష్టం!

ఈ బొంబాయి అమ్మాయి పేరు 'ఇష'. హైదరాబాద్ నుండి విడుదలయ్యే ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చిన ఫోటో చూసి హీరో నాగార్జున ఇషను ఎంపిక చేసి కృష్ణవంశీకి ఆ ఫోటో చూపించడం, కృష్ణవంశీకి ఇష నచ్చడంతో 'చంద్రలేఖ' చిత్రంలో రెండవ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగురాని ఇషకి తొలి చిత్రంలోనే గొప్ప పాత్ర లభించడం అదృష్టం. ఒక్కో సీన్ చేస్తుంటే చాలా చలాకీగా తనలో ఇంత టాలెంట్ వుందా అని తెగ ఆశ్చర్యపోతుందట. ఏమైనా ఆ సినిమా యూనిట్ అంతా వక్కాణిస్తున్నట్లుగా చంద్రలేఖ అద్భుత విజయం సాధిస్తే ఇషకి భవిష్యత్తు అనూహ్యమే!

-శంకర్‌బాబు